పట్నం కోకిల

మాధవరావు మానేజరయాడు.

నిజమే. మామూలు గుమాస్తా మాధవరావు వైకుంఠపాళీ నిచ్చెన ఎక్కేశాడు. అతనికంటే ఐదారుగురు సినియర్స్‌ను అవలీలగా లంఘించి మెరిట్ పెట్టుబడితో ప్రమోషన్ కొట్టేశాడు. మాధవరావుకు ఫైలాలజీలో బోలెడం ప్రావీణ్యత ఉంది. మూడ్రోజుల పనిని మూడుగంటల్లో చేసి చూపించే సత్తా ఉంది. ఆఫీసులో తలెత్తే ఎలాంటి సమస్యనైనా చిటికలో తీర్చేయడంలో అతనికతడే సాటి. ఆఫీసు పనుల్లో ఆల్‌రౌండరంటా రందరూ. అందుకే అతడంటే పైవారి నోట్లో పనసపండు.

అందరికంటే చాకచక్యంగా లారీ నడపగల డ్రైవర్‌కు బస్సు నడపడమేమంత కష్టమైన పనికాదుగదా? అలాగే ఆపరేటివ్ పనుల్లో ఆరి తేరి అకౌంటెన్సీ పరీక్షలో ఫస్ట్‌క్లాస్ మార్కులు సంపాదించిన బెస్ట్‌వర్కర్ అడ్మినిస్ట్రేషన్ పనుల్లో రాణించడం అతి సులభం గదా? అందుకే ప్రమోషన్ వరించింది. ఆ ప్రమోషన్‌లోని ఎమోషనే హైద్రాబాదు దాకా లాక్కొచ్చి మానేజర్ సీట్లో కూచోబెట్టింది.

డ్యూటీలో జాయినైన రోజునుండే అద్దిల్లు కోసం అన్వేషణ ప్రారంభమైంది. చేదోడు వాదోడుగా అటెండర్ గూడా ఉన్నాడు వెంట.

'టులెట్' బోర్డు తగిలించిన ఏ ఇంటికెళ్ళినా 'ఫ్యామిలీకి మాత్రమే ఇవ్వబడును' అనే స్లోగన్ గన్ షాట్‌లా వినపడుతూంది. మాధవరావుకు చిరాకేసింది. కాని చిరాకు గొంతు నులిమి పారెయ్యాల్సి వచ్చింది. లేక పోతే కొత్త సమస్యలు తలెత్తే అవకాశముంది.

"ముందు నేను దిగిపోతాను. రెండు మూడు నెలల్లో ఫ్యామిలీని తెచ్చుకుంటానండి!" సవినయంగా విన్నవించుకున్నాడో ఇంటి ఇల్లాలితో- గడప బయట నిల్చుండి.

"ముందు ఫ్యామిలీతో దిగండి. ఆ తర్వాత సంగతి ఆలోచిద్దాం!" అంటూ దభీన తలుపులు మూసేసుకుందావిడ. వీపుమీద పిడిగుద్దులు పడినట్టనిపించింది.

ఓ ఫైన్ ఇవినింగ్, అన్వేషణ చివరలో అటెండర్ గుండెల్లో జాలి జ్వాలువారిందేమో.

"ముందు మీరు అమ్మగారితో దిగిపొండి సార్, ఆ తర్వాత వెంటనే మళ్ళీ పంపిద్దురుగానీ!...." బ్రహ్మాండమైన సలహా ఇచ్చాననుకుని భుజాలెగరేశాడు.

"నీ దిక్కుమాలిన సలహా నాకక్కరలేదు గానీ, నోర్మూసుకోరా వెధవా!" అనాలనిపించింది కాని, గొంతు దాటిన ఆ మాటలకు పెదాలు దాటే ధైర్యం లేకపోయింది.

"విస్తర్లు ఎత్తమంటే జనాభా లెఖ్ఖలు వెయ్యడం మంచిదికాదు" అనేశాడు.

"అంటే ఏమిటి సార్?"

"అద్దిల్లు వెతుకుదామంటే అమ్మ సంగతి తెస్తావెందుకూ? అమ్మగారి సంగతి ఇప్పుడు కుదరదు." సాధ్యమైనంత నెమ్మదిగా వచ్చింది సమాధానం.

ఐతే, అమ్మగారు కాన్పుకెళ్లంటారు. నిండు చూలాలు కాబోలు.... ఎలా వస్తుందీ? అటెండర్ బుర్రలో మరో ఐడియా తళుక్కుమంది.

"సార్! ప్రస్తుతానికి డ్రామా కంపెనీ అమ్మాయితో దిగిపొండి. ఆ తర్వాత...."

ఐడియా పూర్తిగాక ముందే "నోర్ముయ్!" మన్నాడు. ఆ మర్నాటి నుండి అటెండర్ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాడు.

తన ఆవేదన నంతా ఆఫీసు స్టాఫు ముందు కక్కేశాడు.

"ఎవరింటి దగ్గరనైనా ఓ సింగిల్ రూముంటే వెతికి పెట్టండి, ప్లీజ్!...." బతిమాలాడు, బంగారంలాంటి స్టాటస్‌ను పక్కకు నెట్టి.

అదేదో వినరాని మాట విన్నట్టు - ఎవ్వరూ నోరు తెరవలేదు. మాధవరావుకు మూర్ఛరాబోయే సమయంలో హెడ్ క్లార్క్ నోరు విచ్చుకుంది.

"మీరొచ్చి ముచ్చటగా ముప్పై రోజులన్నా కాలేదు. అప్పుడే హైదరాబాదులో అద్దిల్లు.... అదీ సింగిల్ రూం దొరకడమంటే మాటలా సార్?!"

అందరి సమాధాన మదేనన్నట్టు తలలూగాయి. చూపులు నేల మీద వాలాయి.

ప్రమోషన్ సంతోషం చిటికెలో ఫరారైంది. గోరుచుట్టుమీది రోకటి పోటులా ఈ రోజే వచ్చిందా ఉత్తరం. అది మామూలు ఉత్తరం కాదు. బాంబుకంటే ప్రమాదకరమైంది.

చిత్తగించిన ఉత్తరం ఫైళ్ళ జోలికి పోనివ్వడంలేదు. నరాల్లో సూది మందులా ప్రవేశిస్తున్న నీరసం ఉత్తమ వర్కర్ను ఉత్తమ మనిషిలా మార్చేస్తుంది.

"కాఫీ సార్!" పొగలు కక్కుతున్న కాఫీ ఫక్కున నవ్వింది.

ఛ....కాఫీ కప్పు గ్గూడా లోకువయానా?! వెధవది .... ఔను .... చెప్పేది వినని వాడు చెడిపోతుంటే నవ్వకపోతే ఏంజేస్తారు? కాని....కాని ....ప్చ్....కసి....

ఒక్క గుక్కలో కాఫీ కప్పు ఖాళీ అయిపోయింది.

నరాలు మళ్ళీ నార్మల్ కొస్తున్నాయి. అదే ఉత్తరం మళ్ళీ మాధవ రావు చేతుల్లో విప్పుకుంది.

"అల్లుడు మాధవరావుకు—

నీ నిరాదరణకు గురైన నా కూతురు లవంగిని ఊరివాళ్ళంతా ఆడిపోసుకుంటున్నారు. మీరు విడిగా ఉండి ఇప్పటికి నాలుగేళ్ళు దాటింది. మర్యాదగా వచ్చి లవంగిని తీసుకెళ్తావో లేక విడాకుల నోటీసు పంపించ మంటావో వెంటనే జవాబు రాసి పడెయ్!''

పదుగురిలో అట్టహాసంగా తన కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన మామగారి వార్నింగది!

లవంగి నా నిరాదరణకు గురైందా? నో-ఇదన్యాయం. అయ్యో భగవాన్!....నిజానికి నా నిరాదరణకు గురైంది మరదలు రాజి....అదే రాజవ్వ. ఔను....రాజి ఇప్పుడెలాగుందో?....

ఆ రోజు....మేనమామకు అనారోగ్యం ముంచుకొచ్చిందనే కబు రొచ్చింది. అమ్మా, నాన్నల వెంట తానుగూడా వెళ్ళాడు- పల్లెటూరుకు.

మేనమామ మంచమ్మీద మెలికలు తిరిగిపోతున్నాడు. నిప్పుల్లో పడిపోయినట్టు రొప్పుతున్నాడు. ప్రాణాలు కళ్ళల్లో కొచ్చినట్టున్నాయి. తననూ, అమ్మా, నాన్నలను దగ్గరకు రమ్మన్నాడు కళ్ళతో. అప్పుడే కాస్త నెమ్మదించినట్టుంది.

"వచ్చావా బావా!....మాధవా!.... ఇది నీ మరదలు....రాజవ్వ.... నీదే. అది పుట్టినప్పుడే నీ పెళ్ళామనుకున్నాం. చెల్లెమ్మా! ఇది.... నీ కోడలు.'' రాజి చేతులు అమ్మ చేతుల్లో,తన చేతుల్లో ఉంచాడు వణుకుతూ.

రాజవ్వ....రాజి....పిక్కలుదాటని లంగా, కింద నడుముదాటి పైన జబ్బలు ఏ మాత్రం కనబడనీయని జాకెట్టూ....ముక్కుకున్న ముత్యాల పోగు పైపెదవి మీదాడుతుంది. తైల సంస్కారం లేని జుట్టు.... ఛీ-ఈ పల్లెటూరి బైతా నా పెళ్ళాం?! ఒంటినిండా తేళ్ళూ జెర్రులు పాకొచ్చాయి. అమ్మ కళ్ళు ఊటచెలిమలై పోతున్నాయి. అత్త కొంగు నోట్లో కెళ్ళింది.

"హమ్మ!" తృప్తిగా నిట్టూర్చాడు మామ. ''ఇక....ఇక నాకు నిశ్చింత.... ఇప్పుడు....నేను....నే....నూ....'' తెరుచుకున్న నోరు మళ్ళీ మూసుకోలేదు. గొల్లుమన్నారంతా.

"వదినా!'' నెలరోజుల్లో నిద్రకొచ్చిన అత్త అమ్మనడిగింది. "మీ అన్నయ్య పోయేప్పుడు రాజిని మీ చేతుల్లో ఉంచాడు గదా? ఇహ దాని భారం మీదే వదినా! నన్నొంటరిగా ఉండమని ఆ మహానుభావుడు తన దారి తాను చూచుకున్నాడు." గొంతు వణుకుతూంది. "మాధవరావు కుద్యోగమొచ్చింది. ఇంకా ఆలస్యమెందుకు? ఆ మూడు ముళ్ళూ వేయిస్తే మీ అన్నయ్య ఆత్మకు తృప్తి గదా?"

అక్కడే నిల్చున్న రాజి బుగ్గలు - నునులేత సూర్య కిరణాలు సోకిన పర్వత శిఖరాగ్ర భాగాల్లా ఎర్రబారాయి. విచ్చుకోబోతున్న సిగ్గు మొగ్గలు ఓరచూపులు విసుర్తున్నాయి.

అమ్మానాన్నల చూపులు తనమీదికి మళ్ళాయి ప్రశ్నార్థకంగా.

"మన మాధవుడికి లక్షల్లో కట్నమొస్తుంది. దాంతో మనం సుఖంగా బతకొచ్చు.'' అంతకు ముందోసారి నాన్న అమ్మతో వాదించిన విషయం గుర్తుకొచ్చింది.'' జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలినట్టు మీ అన్నయ్య కూతురు రాజి మనింటి కోడలైతే ప్రయోజనమేముందీ? వాడేమో పట్నంలో నాగరిక ప్రపంచంలో తిరిగే వాడాయె. ఈ పల్లెటూరి పిల్ల వాడి మెడకో గుదిబండై కూచుంటుంది.''

''రాజి నాకొద్దు!" తన గొంతు చించుకు వచ్చిన అరుపుకు నాన్న మొహం విప్పారింది. తనను కొరుక్కుతింటానన్నట్టు చూస్తూ అమ్మ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. అత్త లబోదిబోమంది. రాజి మొహం ఆరేసిన మసిగుడ్డలాగైంది. ఆమె కళ్ళేవో చెప్పాలనుకుంటున్నాయి కాని పెదాలు విప్పుకోవడంలేదు.

''రాజికి చదవడం, రాయడం వస్తుందన్నయ్యా! అది పరీక్ష లివ్వలేదుగానీ రామాయణం, భారతం బాగా చదువుతూంది. ఇంగ్లీషు ముక్కలు గూడా నేర్చుకుంది.'' అత్త చివరి ప్రయత్నం.

"చాలు చాల్లేవమ్మా! చేసుకునేది వాడు. వాడికిష్టం లేనిది నేనేం జెయ్యాలి?'' నాన్న గూడా తప్పుకున్నాడు.

క్షమించరాని నేరం చేసి గ్రామ బహిష్కరణకు గురైన నేరస్తుల్లా తల్లీ కూతుళ్ళు ఉన్న పళాన బయల్దేరి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత రెండేళ్ళకు కోటీశ్వరుని కూతురు లవంగి లక్షన్నర కట్నంతో తన జీవితంలో ప్రవేశించింది. పెద్దింట్లో పెరిగిందని లవంగికి అమ్మ అతి మర్యాదలు చేసింది.

వంటపనీ, ఇంటిపనీ అన్నీ అమ్మ వంతే. లవంగికేమో తొమ్మిది న్నరగ్గాని తెల్లారదు. అప్పుడైనా గొంగడీ, చెప్పులూ రెండూ నాఫి

కావన్నట్టు - పనుల్లో జోక్యం చేసుకునేది కాదు. ఆవిడ దృష్టిలో అమ్మో సేవకురాలైపోయింది. ఆ పనులూ ఈ పనులూ పురమాయిస్తూ సేవలు చేయించుకోవడం లవంగి కలవాటైంది.

లవంగి రోజంతా నవలల్తో కుస్తీపడుతుండేది. సినిమాలకూ, షికార్లకూ లెఖ్ఖేలేదు.

"అమ్మకు పనుల్లో కాస్త సాయం చెయ్యి లవంగి!" అన్నాడు తనోసారి.

అరచేతులంత కళ్ళను అటూ ఇటూ తిప్పేసి.... "ఇంటి పనులు స్వయంగా చేసుకోవడం మా ఇంటావంటా లేదు. ఇప్పుడు కొత్త అలవాటు రాదుగదా!" అనేసింది అందాలను అద్దంలో చూచుకుంటూ.

"....కాని, నువ్వుండేది ఈ ఇంట్లో. సహజీవనం సాగించేది నాతో. ఇంటిపనులే బరువైపోతే ఎలా?"

"ఆ పనులన్నీ మీకలవాటేగదా! అంతగా కావాలంటే ఓ నౌకర్ను పెట్టుకుందాం." అందమైన భుజాలు అలవోకగా ఎగిసిపడ్డాయి.

మూడు నెలలు గడిచాయెలాగో. లవంగి తల్లి కాబోతుందన్న సంగతి తెలిసింది. కోట్ల రూపాయల ఆస్తి దక్కబోతున్నంత సంబరపడి పోయారు అమ్మానాన్నలు. తియ్యని అనుభూతులు తనను ఊహాలోకానికి లాక్కెళ్ళాయి. అప్పుడే లవంగి పుట్టింటికెళ్ళి వచ్చింది.

పుట్టింటినుండి వచ్చిన లవంగి ముద్దమందారంలాగుంది. ఎన్నడూ లేనంత సంబరపడిపోతుంది.

"నీ సంతోష సాగరంలో నన్నుగూడా తేలిపోనీ.... ఇంతకూ ఈ సంతోషానికి కారణం?" అడుగాను తను.

''నేను ఎంచక్కా అబార్షన్ చేయించుకున్నా! చావుకబురు చావ కింది నీరులా వచ్చేసింది. విషయం తెలిసిన అమ్మ అగ్ని పర్వతాలు ప్రత్యక్షంగా చూస్తున్నట్టు అవాక్కైపోయింది.

"అయ్యో....ఇదేమి అపచారం తల్లీ?...."అమ్మ కళ్ళు తడయ్యాయి.

''మాతో ఒక్క మాటన్నా చెప్పకుండా ఇంత సాహసమా?'' నాన్న పడక్కుర్చీలో కూలబడిపోయాడు.

తన గుండెల్లో సముద్రపు హోరు....తన ఆశాసౌధాల నెవరో నిర్దాక్షిణ్యంగా కూలగొడుతున్నట్టనిపించింది. లవంగి పీక నులిమెయ్యా లన్నంత ఆవేశం పొంగుకొచ్చింది.

''ఎందుకంత పాపానికొడిగట్టావ్? నువ్వింకా బాలాకుమారివను కుంటున్నావా? పాతికేళ్ళ వయసు రాగానే సరా?" గద్దించాడు.

"నా కడుపు, నా ఇష్టం. పిల్లలు పుడితే నా అందమంతా గంగ పాలైపోతుంది-తెల్సా?...." చిర్రుబుర్రులాడింది.

పేలబోయే బాంబులాగైంది తన పరిస్థితి.

"అంటే....నువ్వసలు పిల్లల్నే కనవా?"

"ఏమో....ఆలోచిస్తా!"

"మాతృత్వం ఆడదానికో వరమమ్మా! మా వంశాన్నుద్ధరిస్తావను కున్నాం." కుప్పకూలిన అమ్మ కళ్ళు శ్రావణమేఘాలైనాయి.

"ఆఁ.... మాతృత్వమా, వంకాయనా? అందచందాల గురించి పాతచింతకాయ పచ్చడికేం దెల్సూ?" ఒంటికాలుమీద లేచింది లవంగి.

"ఈ ఇంట్లో అందరూ నన్ను నే నంగనాచులే. ఒక్కరికీ నాగరికత తెలీదు, అంతా పదో శతాబ్దం మనుషులే. ఛీ....వెధవ కొంప!" లవంగి

మొహం రక్తవర్ణమైంది. వక్షస్థలం ఎగిసిపడుతూంటే గదిలో దూరి పోయింది.

తన కోపం నశాళానికంటింది,

"నువ్వసలు మనిషివేనా?" లవంగి చెంప ఛెళ్లుమంది. తనను తాను నిగ్రహించుకోవడం అసాధ్యమైపోయింది.

లవంగి రోషం పదింతలైంది. అభిజాత్యం ఆగనంది.

"నన్ను కొడతావా రాస్కెల్?" పళ్ళు పటపట లాడినై. దెబ్బకు దెబ్బ సమాధానమైంది. అరగంటలో సూటుకేసు సర్దుకుని వెళ్ళిపోయింది,

"సార్....సార్!"

నీరవనిశీధిలో ఒంటరిగా సంచరిస్తున్న మనసు హెడ్‌క్లార్క్ పిలుపుతో వర్తమానంలో కొచ్చింది.

"వీరు నిన్నటివరకు లీవులో ఉన్న స్టెనోగ్రాఫర్ రాధగారండి!" పక్కనున్న యువతిని పరిచయంచేసి తప్పుకున్నాడు.

నిండుగా పండిన రేగుపండు దేహఛాయ. రేకులు విప్పిన వదన కమలము. సన్నని పొడగాటి ముక్కూ, నల్లని కలువకళ్ళూ. చెక్కుటద్దాల్ని తలదన్నే చెక్కిళ్ళూ, పొంగుకొచ్చిన వయసు ఆనవాళ్ళను భద్రంగా దాస్తున్న కొంగు....రాధంటే ఈవిడేనా!

"నమస్కారం సార్! లీవునుండి ఈరోజే వచ్చాను సార్?"

"నువ్వు....నువ్వు....'' ఏదో అనాలనుకుంది. గుండె గుబగుబ లాడింది.

''ఏమిటి సార్?''

మందారమకరందాలకెళ్ళిన తుమ్మెద అక్కడే మూర్ఛబోయినట్టు మాధవరావు చూపులు రాధ నెక్కడెక్కడో తడుముతున్నాయి.

''సార్... సార్....జాయినింగ్ రిపోర్ట్ సార్!''

''వెరీగుడ్, వచ్చేశారు గదా!'' సర్దుకోక తప్పలేదు. "నా పేరు మాధవరావు. కొత్తగా ప్రమోషన్ మీదొచ్చాను.'' కళ్ళలోని ఆశ్చర్యం పెదాలమీది నవ్వుగా అవతారం దాల్చింది.

''చాలా సంతోషం సార్!'' శృతి చేసిన వీణానాదం.

ఈమె నెక్కడైనా చూచానా?

లంచ్ తర్వాత....

మానస సరోవరంలో రాయంచలా అడుగులేస్తూ వచ్చింది రాధ చాంబర్లోకి.

''డిక్టేషనేమన్నా ఉందా సార్?'' అరచేతులంత కళ్ళు అటూ ఇటూ తిరిగాయి.

''డిక్టేషనేమ్ లేదు గానీ, మీ పేరూ....'' అనుష్ఠానం వెనకాముందాడింది.

''సాయంత్రం మా ఇంటికి రండి సార్!'' కాయితం ముక్క మీద చకచకా అడ్రసు రాసి టేబుల్ మీదుంచి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆరైంది. శత్రు సైన్యం దురాక్రమణ చెయ్యేక ముందే రక్షణ దళాలు ఎదురు దాడికి తయారైనట్టు - చీకటి రగ్గు భూహూతను కప్పక ముందే వీధి దీపాలు మేమున్నామన్నాయి.

"ఎవరండీ మీరు?" లోపలి కెళ్ళబోతున్న మాధవరావు మీదికి ప్రశ్నాబాణం వదిలాడో యువకుడు. అతడు ఎత్తుగా, బలిష్టంగా, ఎర్రగా ఉన్నాడు.

రాధ ఇచ్చిన అడ్రసు ఇల్లేకదా ఇది! కాయితంతో ఇంటి నెంబరు పోల్చి చూచుకున్నాడు ఇదే ఇల్లు....

"నేనూ.... నా పేరు మాధవరావండీ!"

"ఓహో.... మీరా సార్?.... రండి. కూచోండి." ఘనస్వాగతం లభించింది. దిన పత్రిక ముందుంచి లోపలికెళ్ళిన యువకుడు నిమిషాలు గడ్డకట్టుకుపోకముందే రాధతో తిరిగొచ్చాడు.

"బాగున్నావా బావా?" కళ్ళలోకి సూటిగా చూస్తూ పలుకరించింది రాధ.

బావా....? నేను బావనా?! ఈమె ఆమెనే.... కావచ్చు.

"అనుమానమెందుకు బావా? నేను రాజినే?"

"ఔను.... ఇరుగ్గా - కలకత్తా వీదుల్లాంటి తన ఊహల కందని రాజవ్వనే!

"ఏరికోరి నా మెడలో మూడు ముళ్లేసిన చక్రధారి వీరు. ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. నువ్వు నన్ను వద్దనడం నాకెంతో మేలు చేసింది బావా! లేకపోతే ఈ దేవుడు నాకు చిక్కేవాడుకాదు."

"నాలాంటి సామాన్యులంతా దేవుళ్ళైతే ఈ లోకంలో అసలు మనుష్యులే మిగలరు. మీ విషయమంతా చెప్పిందండీ రాధ." చక్రధారి కలుపుగోలుతనం చకితుణ్ణి చేసింది.

"రాజి రాధగా మారిందంటే ఆవిడ కృషి, పట్టుదలే కారణమండీ!"

"అలాగంటే నేనొప్పుకోను బావా! ఎడారిలా నిస్సారమనుకున్న జీవితంలోకి మహానదిలా ప్రవేశించి ఆత్మవిశ్వాసం నూరిపోసింది వీరు. ఇంటర్‌దాకా చదివించి టైపూ, షార్ట్‌హాండూ నేర్పించింది వీరే. వీరి ప్రోత్సాహంతోనే ఉద్యోగంలో జాయినయాను బావా!" రాధ కళ్ళలోని తెలివైన వెలుతురు - అద్భుతమైన కళాఖండాన్ని చూస్తున్న చిత్రలేఖన విద్యార్థిలా మార్చేసింది మాధవరావును.

పల్లెటూరు కాకి అనుకున్న రాజి పట్నం కోకిలై పోయిందన్న మాట!

"నువ్వు చాలా మారిపోయావు రాజీ!"

"ఏమో బావా! మొన్న మీ ఊరు వెళ్ళాను. అత్తయ్య లవంగి గురించీ, నీ గురించీ అంతా చెప్పింది. నాకెంతో బాధనిపిస్తుంది...."

రాధ సానుభూతి మాటలు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. పని మనిషి టీ అందిస్తుంది.

"కట్నాన్ని కమ్ముడుబోతే కష్టాలు కొనితెచ్చున్నట్టే గదా?" టీ సిప్ చేస్తున్న చక్రధారి కనుబొమలు పైకి లెచాయి.

మాధవరావు బుర్ర భూగోళమైంది. గుండెకు ఏ మూలనో గాయమై అందులోంచి ఒక్కొక్క కన్నీటిచుక్క ప్రసస్తున్నట్టనిపించింది.

"చేసుకున్నోడికి చేసుకున్నంత!" మాధవరావు పెదాలు దాటిన మాట రాధ, చక్రధారులదాకా పాకలేదు.

"దూరపుకొండలు ఎప్పుడూ నునుపేనండీ!"

ఈ మాటలు అందరికీ వినబడినై.

"నమచ్కారమండీ!" చేతులు జోడించిందో చిన్నారి - ఎంతో ముద్దొస్తుంది.

"ఇది మా అమ్మాయి రత్న." చక్రధారి ఒళ్ళోకి లాక్కున్నాడా పాపను.

(ఆకాశవాణి- హైదరాబాదు వాణిజ్య, 31-8-1995)